# అనాథలు

-కె.వి.రామ్‌దాస్

కంప్యూటర్ కీబోర్డు మీద శరణ్ చేతివేళ్ళు చకచకా కదులుతున్నాయి. ఎక్సల్ షీట్లో టేబుల్స్ క్రియేట్ చేస్తూ స్టేటస్టిక్సిని ఫీడ్ చేస్తున్నాడు. ఈ ఒక్క టేబుల్ ఫినిష్ చేస్తే ఈ రోజుకి పని పూర్తయినట్టే అని మనసులో అనుకున్నాడు. అప్పటికే ఆఫీసులో మూడొంతుల సీట్లు ఖాళీ అయ్యాయి.

"శరణ్! ఏడైంది. ఇంకా ఎంతసేపని కంప్యూటర్‌తో కుస్తీ పడతావ్. ఇక చాల్లే కదులు'' మనసులో విసుగుని కష్టంమీద కప్పిపుచ్చుకుంటూ అన్నాడు వివేక్.

వివేక్ ఎందుకంత తొందరపడుతున్నాడో శరణ్‌కే కాదు, అక్కడున్న మాధవికి కూడా అర్థమైంది.

వివేక్ ఆ మాటలన్నది శరణ్ ఉదయం నుండీ కష్టపడుతున్నాడన్న జాలితో కాదు, ఎంత త్వరగా శరణ్ వర్క్ ఫినిష్ చేసి బయటపడితే అంత త్వరగా అతనితో బైక్‌మీద ఫ్రీగా లిఫ్ట్ తీసుకుని ఇంటివరకూ హాయిగా పోవచ్చునని అతడి ఆలోచన. ఛీ... ఎంత స్వార్థం... మనసులోనే వివేక్‌ని తిట్టుకుంది మాధవి.

బాస్ నుండి బోయ్ వరకు అక్కడ అందరూ తమ అవసరాలు శరణ్ ద్వారా నిస్సంకోచంగా ఎప్పటికప్పుడు తీర్చుకున్నవారేగానీ వ్యక్తిగా అతడ్ని గౌరవించడానికి మాత్రం వారికి అతని పుట్టుక అడ్డు. పైపెచ్చు చులకన చేసే మాటలు.

కాలాన్ని పట్టించుకోకుండా కార్యాచరణలో కరిగిపోయిన శరణ్‌ని చూసి వివేక్ సహనాన్ని కోల్పోయాడు. దాంతో నోరు జారడానికి కూడా వెనకాడలేదు.

"మావాళ్లంటూ ఇంటి దగ్గర మాకోసం ఎదురు చూస్తుంటారు బాబూ. నీలా అనాథలం కాదుగా, ఎప్పుడు పడితే అప్పుడు కొంపకి చేరడానికి'' అన్నాడు వివేక్.

ఈ మాటలు చివ్వుమని గుచ్చుకున్నాయి శరణ్‌కి. ఆ వెంటనే నిర్లిప్తమైన నవ్వు పెదవులపై కదలాడింది. వివేక్ మాటలు అతనికి కోపం తెప్పించలేదు. ఎందుకంటే ప్రతిరోజూ అనాథ అన్న మాట ఇంటా బయటా ఎందరి నోటో వింటూనే ఉంటాడు. కారణం అతను అనాథ.

అవును అతడు నిజంగా అనాథే.

ప్రేమకి ప్రతిరూపమో లేక కామానికి పరాకాష్ఠో కానీ అతని ప్రమేయం లేకుండానే ఈనేలమీద పడ్డాడు. చెత్తకుండీలో ఎంగిలాకుల మధ్య కాకున్నా అనాథాశ్రమం అరుగుమీద పడుకోబెట్టి వెళ్లిపోయిందా తల్లి. అయినా అతడికి తన తల్లన్నా లేదా ఆడవాళ్లన్నా ద్వేషం మొలకెత్తలేదు.

అందుకు కారణం లేకపోలేదు.

ఓ తల్లి అతడ్ని వీధిపాలుచేసినా మరో అజ్ఞాత దేవతామూర్తి అనాథాశ్రమం నుండి విడిపించి సొంత ఖర్చులతో అతడ్ని హాస్టల్లో ఉంచి చదివించి ఇంతవాడ్ని చేసింది. ఎన్నోసార్లు అనుకున్నాడు ఆ దేవతని చూడాలని. కానీ అతడికా అదృష్టం దక్కలేదు. ఎంతో అందంగా మనసులో చిత్రించుకున్న ఆమె రూపు మాత్రమే అతడికి తీపిగుర్తుగా మిగిలిపోయింది.

"వివేక్! నువ్వు నడువు. అయిపోయింది వచ్చేస్తున్నా'' అంటూ కంప్యూటర్ షట్‌డౌన్ చేసాడు శరణ్. వివేక్ మాటలు శరణ్‌కి కోపం తెప్పించకపోయినా మాధవికి వళ్ళు మండించాయి.

అయినా ఎవరెన్ని మాటలన్నా ఎందుకు పట్టించుకోడీ శరణ్? ఎందుకు వారిపై ఎదురు తిరగడు? ఒక్కసారి సూటిగా సమాధానం చెబితే మరెవ్వరూ మళ్లీ అతడ్ని అనాథ అనడానికి ధైర్యం చేయరు. ఎప్పటికైనా అతడ్ని అనాథ అన్న వారిని శరణ్ పెడాపెడా రెండు వాయిస్తే చూసి సంతోషించాలని చాలా రోజులుగా ఆశతో ఎదురుచూస్తోంది మాధవి. 'ప్చ్... ఆ రోజు వస్తుందా?' మనసులో అనుకుని తన ఆలోచనలని కట్టిపెట్టి ఆమె కూడా ఇంటికి బయలుదేరింది.

★★★

"ఏమిటోయ్ శరణ్! నేను పంపమన్న వీక్లీ రిపోర్ట్స్ అన్నీ హెడ్డాఫీసుకి పంపావా?'' అడిగాడు మేనేజర్ మోహన్‌రావు.

"మొత్తం రిపోర్ట్స్ అన్నీ ఈమైల్లో అటాచ్మెంట్ ఫైల్‌గా పంపాను సార్. కాపీ మీక్కూడా మార్కు చేసాను. డౌన్‌లోడ్ కాలేదా?'' సందేహంగా అడిగాడు వివేక్.

"అది కాదోయ్. నేనింకా మేల్స్ చెక్ చేయలేదు. ఒకసారి కన్ఫామ్ చేసుకుందామని అడిగాను. అయినా నీకు అప్పగించాకా బాధ్యతతో ఆ పని పూర్తి చేస్తావనుకో''

"మే ఐ కమిన్ సార్?'' మాధవి లోపలికి అడుగిడుతూ మర్యాదకొద్దీ అడిగింది.

"యస్ కమిన్. టేక్ యువర్ సీట్'' అన్నాడు మోహనరావు.

"సార్! సేల్స్ ప్రమోషన్ ఏక్టివిటీస్ గురించి మీతో డిస్కస్ చేయాలి. డెసిషన్ కోసం వచ్చాను''

"చూడు మాధవీ! వుయ్ హేవ్ ఫుల్ ఫైత్ ఆన్ యూ. యు కెన్ గో ఎహెడ్'' అభయమిచ్చాడు మోహనరావు.

"ఆ...అన్నట్లు శరణ్! నిన్న టీవీలో అనాథ పిల్లల గురించి ఓ ప్రోగ్రామ్ వచ్చిందోయ్. ఇట్స్ సింప్లీ సుపర్బ్. ఆ ప్రోగ్రామ్ చూస్తున్నంతసేపూ నువ్వే గుర్తుకువచ్చావనుకో. ఐ రియల్లీ పిటీ దెమ్''

"ఆహా... '' అని పొడిగా జవాబిచ్చాడు శరణ్ ఇబ్బందిగా ఫీలవుతూ.

ఆఫీస్ పని పక్కన పెట్టి పనిగట్టుకుని మరీ ఈ విషయం శరణ్‌తో చర్చించడంలో బాస్ ఉద్దేశ్యం ఏమిటని మనసులో అనుకుంది మాధవి. బాస్ మీద కోపం వచ్చింది. 'అనాథ...అనాథ' అని ఏదో విధంగా పదేపదే శరణ్ మనసు నొప్పించడమేనా బాస్‌తోసహా ఇక్కడి అందరి ఉద్దేశ్యం?

మోహన్‌రావు మళ్లీ ఏదో చెప్పబోయాడు.

"సార్! అర్జంటు లెటరొకటి ఫాక్స్ చేయాలి. మళ్లీ వస్తాను'' అంటూ శరణ్ చిన్నబోయిన ముఖంతో బయటకి నడిచాడు.

"ఆ... మాధవీ! నువ్వేదో డిస్కస్ చేయాలన్నావు?'' అన్నాడు మోహనరావు.

"నో సార్... నేను వివరాలతో తరువాత వస్తాను'' అతడితో మాట్లాడ బుద్ధికాక బయటకొచ్చేసి తన సీట్లోకి వెళ్లి కూర్చుంది మాధవి.

'ఏం మనుషులు వీళ్లు? సాటి మనిషిని మనిషిగా ఎందుకు గుర్తించరు? ఎందుకు ఎదుటివారిని గాయపరిచేటట్లు మాట్లాడతారు? ఎదుటివారిని నొప్పించి సంతోషించే మనుషులూ మనుషు

లేనా?' ఇలా పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది మాధవి.

"మేడమ్! మన అక్కౌంట్స్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు రిటైర్ కాబోతున్న సందర్భంలో అందరూ కలసి అతనికి గ్రాండ్‌గా ఫేర్‌వెల్ ఇవ్వదలిచారు. ఐదువందలకి తక్కువ కాకుండా ఇవ్వాలని డిసైడైంది. ఆపై ఎంత ఎక్కువ ఇచ్చినా నో ప్రాబ్లమ్. మీవంతు కంట్రిబ్యూషన్ ఎంత రాసుకోమంటారు మేడమ్?" అంటూ ఓ కాగితం తీసుకొచ్చాడు ఆఫీస్ బోయ్ వోబులు.

ఆ కాగితం చూసింది మాధవి. అప్పుడే ఇద్దరు ముగ్గురు డబ్బిచ్చినట్లు వ్రాసుంది.

"చూస్తాలే వోబులు. ఇంకా టైముందిగా. రేపో ఎల్లుండో ఇస్తాను" అని అతన్ని పంపేసింది.

అక్కడి నుండి వోబులు తిన్నగా శరణ్ సీటు దగ్గరకొచ్చాడు. విషయం చెప్పాడు.

"సార్! మీవంతు కంట్రిబ్యూషన్ సార్. అందరికంటే మీరే ఎక్కువ ఇవ్వాలి" అన్నాడు వోబులు.

"లేదు వోబులు. నానుండి ఉమామహేశ్వరరావుగారికి నా హృదయపూర్వక బెస్ట్ విషెస్ తప్ప నేనేమీ ఇవ్వలేను" అన్నాడు శరణ్.

ఆ మాటలకి బాంబు పేలినంత కంగారుగా చూసాడు వోబులు.

"ఏమిటి? మీరు కాదంటున్నారా? ముందూ వెనుకా ఎవరూలేని మీరు ఆమాత్రం ఇవ్వలేరా. అందులోనూ కొలీగ్ ఫంక్షన్‌కి" వోబులు మాటల్లో చులనకభావం తొంగి చూసింది.

"ఒకసారి చెప్పానుకదా. నన్ను విసిగించకు"

శరణ్ డబ్బివ్వకపోవడం పెద్ద చర్చనీయాంశమైంది ఆఫీసులో. వీడు అనాధే అనుకున్నాంగానీ డబ్బు మనిషి కూడా అని ఇప్పుడే తెలుసుకున్నాం అని ప్రత్యక్షంగా కొందరు, పరోక్షంగా మరికొందరు శరణ్‌ని తిట్టిపోసారు. అయినా శరణ్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

***


"మాధవీ! ఈరోజు శరణ్ లీవ్‌లో వున్నాడు. అతని వర్కు ఈ ఒక్కరోజుకీ నువ్వు టేకప్ చేయి" ఆర్డర్ వేసాడు మోహనరావు.

"అలాగే సార్" అంది మాధవి.

శరణ్ టేబుల్‌వద్దకు వచ్చి డ్రా ఓపెన్ చేసి అర్జంట్ పేపర్స్ ఏమిటా అని వెతకసాగింది. డ్రాలో కాగితాల నడుమ ఆఫీస్ డైరీ కనబడింది. బహూశా పెండింగ్ వర్క్ అందులో శరణ్ రాసుంటాడని పేజీలు తిరగేసింది. చక్కని ముత్యాల్లాంటి అక్షరాలతో రాసుకున్నాడు శరణ్. అందులో కొన్ని పేజీలు స్వవిషయాలతో నిండి ఉన్నాయి. తప్పని మనసు హెచ్చరించేలోపు మెదడు సగం విషయాల్ని అప్పటికే గ్రహించేసింది. గిల్టీనెస్‌తోనే మొత్తం చదవడం పూర్తి చేసింది. తెలిసిన నిజాలతో మాధవి హృదయం బరువెక్కింది. శరణ్ ఫేర్‌వెల్ ఫంక్షన్‌ని ఎందుకు కంట్రిబ్యూట్ చేయంలేదో ఇప్పుడు అర్థమైంది మాధవికి. ఎవరి ఊహాలకందని వ్యక్తి శరణ్. మొదటిసారిగా శరణ్ రూపం ఆమె మనోఫలకంపై బలంగా ముద్ర వేసుకుంది.

***

"మాధవీగారూ! ఏమిటి మీరంటున్నది?" నమ్మశక్యం కానట్టుగా అన్నాడు శరణ్.



"అవును శరణ్‌గారూ! బాగా ఆలోచించే నేనీ నిర్ణయానికి వచ్చాను" స్థిరంగా అంది మాధవి.

"దిక్కూమొక్కూలేని అనాధనని మీకు తెలుసుగా. నాపై జాలితో తొందర పడుతున్నారేమో?"


"తోటి మనిషిని మనిషిగా ప్రేమించే వ్యక్తి తోడు కోసమే నేనిన్నాళ్లూ ఎదురు చూసాను. ఆ వ్యక్తి పుట్టుపూర్వోత్తరాలు నాకనవసరం. మీ గురించి తెలుసుకున్నాక నా నిరీక్షణ ఫలించే అవకాశం దొరికిందని అనుకున్నాను. అందుకే సూటిగా మీ జీవిత భాగస్వామిని కావాలనుందని చెప్పాను. అంతే గానీ జాలితో మాత్రం కాదు"

"లేదు మాధవిగారూ! అందం, చదువు, సంస్కారం అన్నీ ఉన్న మీకు తగినవారు మన ఆఫీసులోనే చాలామంది ఉన్నారు. మళ్లీ ఆలోచించుకోండి. నా గురించి మీరు తెలుసుకున్నది చాలా కొంచెం. నాకు కొన్ని ఆశయాలున్నాయి. అవి నెరవేరాలంటే నేనసలు పెళ్లి చేసుకోకూడదు. నా ఆశయాల

## సక్సెస్ స్టోరి

పశ్చిమబెంగాల్‌లోని దుర్గాపూర్‌లో చదువుకుంటూనే తండ్రి కొట్లో కూరలమ్మే వాడు రాము. కొన్నాళ్లక్రితం స్టేట్ ఎంట్రన్స్ పరీక్షలో 15,434 ర్యాంకు తెచ్చుకున్నా అతనికి గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు రాలేదు. ప్రైవేట్‌కాలేజీలో ఫీజులు కట్టే ఆర్థిక స్థోమత లేదు. ఈ సంగతి విని భజన్ చక్రవర్తి అనే ఎమ్మెల్యే అతన్ని ఓ ప్రైవేట్ కాలేజీలో చేరడానికి సాయపడ్డాడు. అతను బాగా చదువుకోవడం చూసి కాలేజీలు ఫీజులు మాఫీ చేసి స్టడీమెటీరియల్ కూడా ఫ్రీగా సప్లయ్ చేశారుట. దుర్గాపూర్‌లోని ఓ కో ఆపరేటివ్ సంస్థ అతనికి నెలకి వెయ్యి రూపాయలు స్కాలర్‌షిప్ ఇచ్చింది. ఇటీవల ఇంజనీరింగ్ పూర్తిచేసిన అతన్ని టాటా కన్సల్టెన్సీ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా సెలెక్ట్ చేశారు. కాలేజీలో చదువుకుంటున్నా ప్రతిరోజూ కూరలకొట్లో తండ్రికి సాయపడేవాడు రాము. ఆ సక్సెస్‌స్టోరీకి స్ఫూర్తిచెంది అలాంటి పేదవిద్యార్థులకి ఫ్రీగా తమ కాలేజీలో సీటిచ్చి ఆదుకోవాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. ఈ నిర్ణయంలో ప్రతిభ ఉండి పేదరికం అడ్డుగా ఉన్న విద్యా రత్నాలు ఎంతోమంది ప్రయోజనం పొందే అవకాశం ఉంది. అయితే వారి గురించి ప్రచారం జరగాల్సిన అవసరం ఉంది.

-తటవర్తి




మూలంగా రాబోయే ఆమె ఆశలు తీరకపోవచ్చు. ఆమెకి నా మూలంగా అన్యాయం జరగకూడదు. నా ఆశయానికి ఎవరూ అడ్డు నిలవకూడదనే పెళ్లి చేసుకోకూడదనుకున్నాను."

"అలా ఎందుకనుకోవాలి? మిమ్మల్ని అర్థం చేసుకుని మీ ఆశయాలని తన ఆశయాలుగా భావించే ఆమె మీకు దొరకవచ్చుగా. ఇక నా విషయానికి వస్తే మీ ఆశయాలని అర్థం చేసుకునే నేనీ నిర్ణయానికి వచ్చను."

"నా ఆశయం సామాన్యమైనది కాదు మాధవిగారూ. ఎవ్వరూ తీసుకోని నిర్ణయం తీసుకోబోతున్నాను. అది విన్నాక మీరు నాకు తోడుంటారని నేననుకోను."

"అదేమిటో చెప్పండి ప్లీజ్"

"నేను ఒకరిని దత్తత చేసుకోవాలనుకుంటున్నాను."

"ఇంతేనా? ఎవరిని? ఏ అనాధ పిల్లలనో! ఎందుకంటే సహజంగా మీకు అనాధలపట్ల జాలి వుంటుంది. సరే దానికి నాకేం అభ్యంతరంలేదు."

"కాదు. నేను దత్తత చేసుకోవాలనుకుంటున్నది...ఓ తల్లిని."

"వ్వాట్?"

"యస్! ఏదైనా ఓల్డేజ్ హోమ్ నుండి వయసుమళ్లిన స్త్రీని తీసుకొచ్చి నేనామెకి కొడుకుగా జీవితాంతం సేవ చేయదలచుకున్నాను."

"వయస్సు మళ్లిన స్త్రీని తీసుకొచ్చి తల్లిగా పెంచుకుంటారా?" నమ్మశక్యం కానట్టు అంది మాధవి.

"చూసారా! అందరిలాగే మీరు కూడా ఆలోచించారు? ఏం? పిల్లలులేని తల్లిదండ్రులు బిడ్డలని దత్తత తీసుకోవడంలేదూ? అలాగే తల్లిలేని నేను ఎవరూలేని ఓ స్త్రీని ఎందుకు దత్తత తీసుకోకూడదు? ఇందులో ఏదో త్యాగం ఉందని నేను భావించడంలేదు."

"ఇది త్యాగం కాక మరేమిటి? మీ ఈ నిర్ణయం మూలంగా మీ వైవాహిక జీవితాన్ని త్యాగం చేయాలనుకుంటున్నారు కదా?"

"మీరు త్యాగమే అనుకోండి లేదా నాది వెర్రి ఆదర్శమే అనుకోండి. ఇది నా జీవితాశయం. ఏ భార్యా తన భర్త ఇలాంటి పని చేస్తే ఊరుకోదు. అత్తలేని కోడలు ఉత్తమురాలన్న నానుడీ ఉండనే ఉంది. లేనిపోని తలనొప్పి ఏ ఆడది మాత్రం కోరుకుంటుంది? సొంత అత్తలనే ఛీ కొడుతున్న ఈ రోజుల్లో రాబోయే ఆమె ఈ నా నిర్ణయాన్నిససేమిరా ఒప్పుకోదని తెలుసు."

"చూసారా! ఎలా షాక్ తిన్నారో? సరే చీకటైంది. ఇక బయల్దేరదామా?"

"శరణ్‌గారూ! మిమ్మల్ని నేను పెళ్లి చేసుకోవాలంటే చిన్న షరతు"

"ఏమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు శరణ్.

"ఉన్నతమైన మీ ఆశయాన్ని విన్నాకా నేనూ మీలాగే ఉన్నతంగా ఆలోచించడం మొదలుపెట్టాను. మనకి ఓ తల్లే కాదు, ఇద్దరు బిడ్డలు కూడా అవసరమే. వారు మన రక్తం పంచుకుని పుట్టిన వారయ్యేకన్నా అనాధలైతేనే మన ఆదర్శానికి అర్థం వుంటుందని అనుకుంటున్నాను. వారే మనకీ జన్మలో కన్న బిడ్డలు." నివ్వెరపోవడం శరణ్ వంతయింది.

"మాధవీ" ఆత్మీయతతో నిండిన ఏకవచన సంబోధన మొదటిసారిగా వెలువడింది శరణ్ నోట.

"నువ్వు నన్ను పూర్తిగా ఓడించావు. నన్ను అర్థం చేసుకున్నందుకు థాంక్స్" ఆమె చేతుల్ని మృదువుగా తాకుతూ అన్నాడు శరణ్.

★★★

అది లంచ్ అవర్. ఆఫీసులో స్టాఫంతా డైనింగ్ హాల్లో కూర్చుని టిఫిన్ బాక్సులు, కేరేజీలు తెరిచి ఖుషీగా కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు.

"ఏంవోయ్ శరణ్! ఏం తెచ్చావేమిటి?" అడిగాడు క్యాషియర్ కృష్ణారావు.

"ఆ...వెరైటీ ఏంలేదు" సిగ్గుపడుతూ చెప్పాడు శరణ్.

"అవున్లే నీకెవరున్నారని కమ్మనైన వెరైటీలు చేసి పెట్టడానికి? ఒంటరి

ప్రాణివి కదా'' వేళాకోళంగా అన్నాడు.

"భలే చెప్పారు సార్. ఈ అనాథకి శ్రేష్ఠమైన ఇంటి రుచులు ఎలా తెలుస్తాయిలెండి'' వంత పాడాడు అదో విధంగా నవ్వుతూ వివేక్.

అక్కడే ఉండి అందరితో లంచ్ చేస్తున్న మాధవికి ఈ మాటలు రుచించడంలేదు. కోపాన్ని కష్టంమీద కంట్రోల్ చేసుకుంటూ లంచ్ త్వరగా ముగించి అక్కడ నుండి కదలాలనుకుంది.

"అయినా శరణ్! నాదో చిన్న సలహా! గంతకి తగ్గ బొంత ఎవరినయినా చూసి మూడుముళ్ళు వేసేయరాదూ? నీకీ తిప్పలు తప్పుతాయి'' అన్నాడు కృష్ణమూర్తి మీసాల్ని పొడిగిస్తూ. ఈ మాటలకి మాధవి హృదయం భగ్గుమంది.

"స్టాపిట్ ఐసే...'' కోపం కట్టలు తెంచుకోగా ఒక్క ఉదుటున లేచి అపరకాళిలా అరిచింది మాధవి. ఊహించని పరిణామానికి అక్కడివారందరూ దిగ్భ్రాంతితో కిమ్మనకుండా ఆమెనే చూసారు.

"ఏమిటి కృష్ణారావుగారూ! శరణ్ అనాథా? సరే అతడు అనాథే కావచ్చు. అతడికి తల్లిదండ్రులెవరూ లేకపోవచ్చు. కానీ మీ సంగతేమిటి? ముసలి వయస్సులో తల్లిదండ్రుల బాధ్యత వహించవలసిందిపోయి నిర్దాక్షిణ్యంగా వారిని ఇంటి నుండి వెళ్లగొట్టిన మీరు తల్లిదండ్రులులేని అనాథ కారా?''

ఊహించని ఈ ప్రశ్నకి కృష్ణారావు తల దించుకున్నాడు.

"మిస్టర్ వివేక్! శరణ్‌ని 'అనాథ...అనాథ' అని పదేపదే దెప్పి పొడుస్తున్నారే. మరి నీ మాటేంటీ? తల్లిదండ్రులు నీ అసలు రూపాన్ని తెలుసుకుని నిన్ను ఇంట్లోంచి ఈమధ్యే తరిమేసిన సంగతి ఎవరికీ తెలియదనుకుంటున్నావా? ఆస్తికోసం కన్నవారిపై ముందు వెనుకలు ఆలోచించకుండా కోర్టుకెక్కి, అది నీ తండ్రి కష్టార్జితమని, నీకే హక్కూ లేదని భంగపడిన సంగతి అందరికీ తెలిసిందే. నీ నిర్వాకానికి నిన్ను ఇంట్లోంచి శాశ్వతంగా తరిమేసారు. అలాంటి నువ్వు అనాథవి కాదా?''

ఈ మాటలకి వివేక్ మొహంలో కత్తివేటుకి నెత్తుటి చుక్కలేదు.

"సార్... మోహనరావుగారూ! మీ మాటేమిటి? మీకు అనాథలంటే చాలా జాలి. వారిపై వచ్చే ప్రోగ్రామ్స్, శీర్షికలని చూసీ, చదివి జాలిపడుతూ అవసరమున్నా లేకున్నా అందరి ముందు లెక్చర్స్ ఇస్తారు. ప్రత్యేకంగా శరణ్ దగ్గర. ఇన్నాళ్లయినా పసికందుల బోసినవ్వులకి నోచుకోని మీరు ఓ అనాథని చేరదీసి పెంచుకుంటే ఇటు మీకు పిల్లలులేని లోటూ, అటు ఓ అనాథకి దారి చూపినట్లు అవుతుందని ఎప్పుడైనా ఆలోచించారా? లేదే! అనాథలపై జాలి తప్ప వారిని నిజంగా ఆదుకోవాలనే ఆలోచన మీకు లేదు. కానీ శరణ్ ముగ్గురు అనాథల్ని తన జీతంతో పోషిస్తున్నాడు.''

"మాధవీ! యు ఆర్ క్రాసింగ్ యువర్ లిమిట్స్'' అధికార దర్పంతో అన్నాడు మోహనరావు.

"మాధవిగారూ! కంట్రోల్ యవర్ సెల్ఫ్'' అభ్యర్థన పూర్వకంగా అన్నాడు శరణ్.

"నో..లెట్ మీ కంటిన్యూ. ఆ రోజు మన అక్కౌంటెంట్ ఫేర్‌వెల్‌కి అందరూ చందాలిచ్చినా శరణ్ ఇవ్వలేదని అతడ్ని డబ్బు మనిషన్నారు. అవసరమున్నా లేకపోయినా ఫార్మాల్టీ కోసమో, లేక గొప్ప కోసమో ఉమామహేశ్వరరావుకి మనమంతా ఘనంగా పార్టీ ఇచ్చామేగానీ, నిత్యం మన బాగోగుల్ని చూసే మన ఆయా అలివేలు జబ్బుపడి ఆసుపత్రి పాలైతే మనలో ఒక్కరు వెళ్లి ఆమెని పలకరించామా? కానీ శరణ్ రోజూ ఆమెని చూసి ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడమేకాదు, మొత్తం ఖర్చుల్ని అతడే భరిస్తున్నాడు. అంతెందుకు... ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల్ని, తోబుట్టువుల్ని దూరం చేసుకుంటున్న ఈ రోజుల్లో మన ఊహలకందని సాహసానికి సిద్ధపడ్డాడు శరణ్. అదేమిటో తెలుసా? ఎవరో మనలాంటి పుణ్యాత్ముల వెలికి గురైన ఓ వృద్ధురాల్ని ఆశ్రమం నుండి దత్తత తీసుకుని ఆమెకి కొడుకుగా తన వంతు బాధ్యతల్ని నిర్వర్తించాలని స్థిరంగా నిర్ణయించుకున్నాడు. ఇప్పుడు చెప్పండి! తల్లిదండ్రులనీ, రక్తసంబంధీకులనీ స్వార్థంతో దూరం చేసుకుంటూ ఈ సమాజంలో ఫాల్స్ స్టేటస్ కోసం పాకులాడుతున్న మనం అనాథలమా? లేక మంచితనంతో, తన చేతలతో నలుగురినీ ఆదరిస్తూ తనకంటూ కొందరు ఆత్మీయులని సంపాదించుకున్న శరణ్ అనాథా? నేనూ, నా భార్యా, నా పిల్లలే లోకమనుకుని తల్లిదండ్రులని దూరం చేసుకునే ప్రతి ఒక్కరూ అనాథలే.''

ఆడపులిలా ఆగ్రహిస్తూ అగ్నిబాణాల్లాంటి మాటలతో ఆమె అందరినీ అలా నిలదీసి అడిగేసరికి అక్కడ ఒక్కరి నోటా మాట లేదు. కాసేపటికి తనని తాను తమాయించుకుంది మాధవి.

"సారీ...నా మాటలు మీలో ఎవరినైనా గాయపరిస్తే నన్ను క్షమించండి. శరణ్‌ని ఎవరు పెళ్లి చేసుకుంటుందనేగా మీ సందేహం? మా మనసులు ఎప్పుడో కలిసాయి. నాకూ శరణ్‌కి త్వరలో పెళ్లి'' కొసమెరుపుగా వినిపించింది మాధవి.

★



## డైలమా

నంది అవార్డు రాగానే తానెంతో ఎత్తుకెదిగిపోయాననుకుంది కమలినీ ముఖర్జీ. ఆనంద్, మీనాక్షి, గోదావరి, స్టయిల్ చిత్రాల్లో నటించిన ఈభామ తరువాత కొన్ని పెద్ద ప్రాజెక్టుల్లో అవకాశమొచ్చినా రెమ్యూనరేషన్ సరిపోక ఆమె వదులుకుంది. 'శ్రీరామదాసు' చిత్రంలో అవకాశాన్ని కాదన్న కమలినీ ఇప్పుడు డైలమాలో పడిపోయింది. మోడలింగ్‌కి అంకితం అవుతానని పైకి చెబుతున్నా రెమ్యూనరేషన్ విషయంలో ఆమె వైఖరి నచ్చక నిర్మాతలు ఆమెని పక్కన పెట్టినట్టు వినికిడి.

